

## వారం వారం

# ఆత్రేయ

చివరి రోజుల్లో ఆత్రేయ హెల్త్, వెల్త్ - ఈ రెండు సమస్యలతో కొంచెం ఇబ్బంది పడేవారు. అయితే ఆయన అనారోగ్యాన్ని లక్ష్యపెట్టే వారు కాదు సరికదా - తన అనారోగ్యం మీదా, మృత్యువు మీదా ఛలోక్తులు వేసేవారు. రావాల్సిన డబ్బు సకాలంలో అందకపోతేమాత్రం ఆయన మూడేమారిపోయేది. అందుకే "ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు కాని నా దృష్టిలో మహాభాగ్యమే ఆరోగ్యం''అనే వారు.

అరవై పైబడినప్పటి నుంచీ ఆత్రేయ మరో పదేళ్ళు పెద్దగా కనిపించే వారు. కాని ఆయనను ఎవరైనా 'ఓల్డ్ మేన్' అంటే ఒప్పుకునేవారు కాదు. "మనసు కవిని - నాకు ముసలి తనం రాద'నే వారు. మీరు 'ఓల్డ్ జనరేషన్'కు చెందినవారు అని ఒక నిర్మాత అంటే -"అయామ్ నాట్ ఓల్డ్"అన్నారు ఆత్రేయ. "అలా అనకండి. వయసును ఒప్పుకోవడం వల్ల మీకొచ్చే నష్టం లేదు. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అన్నారు కదండీ''అన్నారా నిర్మాత. ఆత్రేయ వెంటనే"బట్ గోల్డ్ ఈజ్ నెవ్వర్ ఓల్డ్"అన్నారు. అవును - బంగారం వన్నె ఎప్పటికీ తరగదు. ఆత్రేయ కలం పదును చివరి వరకూ చెక్కు చెదరలేదు!

అయిదారేళ్ళ క్రితమే అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆత్రేయకు వైద్య పరీక్షలు చేసిన తర్వాత డాక్టరు "మీకు హార్ట్ ఎన్‌లార్జ్ అయింది. జాగ్రత్తగా వుండాలి" అని చెప్పారట. "ఓస్ - - ఇదా మీరు కనుక్కొన్న సత్యం. మీరింకా ఏదో కొత్త విషయం చెప్తారనుకున్నాను. ఈ విషయం చెప్పడానికి ఇన్ని పరీక్షలెందుకు? ఇంత ఫీజెందుకు? నా హృదయం విశాలమైందని అందరికీ తెలుసు" అన్నారట వైద్య సిబ్బందితో మనసు కవి ఆత్రేయ. మూగ మనసులు, తేనె మనసులు, కన్నె మనసులు, పాల మనసులు, మంచి మనసులు, కలసిన మనసులు మొదలైన చిత్రాలకు రచన చేసిన ఆత్రేయ, "నేను 'హార్ట్ స్పెషలిస్టు'ను" అని చమత్కరించే వారు. చివరకు ఆయన 'హార్ట్ ఎటాక్'తో కన్ను



మూయడం మరువలేని ట్రాజెడీ!

ఆత్రేయ తన ఆరోగ్యం గురించి పరామర్శ చేయడానికొచ్చిన ఆప్తులతో తరచూ ఒక ఛలోక్తి చెపుతుండే వారు." డాక్టర్లు నా వెయిట్ తగ్గాలంటున్నారు. ఆత్రేయ వెయిట్ అంత తొందరగా తగ్గుతుందా? " అని! ఆత్రేయ అంతిమ దర్శనానికి వచ్చిన శ్రీ విజయబాపినీడు ఈ 'జోక్'ను గుర్తుకు తెచ్చుకొని చెమ్మగిల్లిన కళ్ళతో "ఆత్రేయ వెయిట్ ఎప్పటికీ తగ్గదు. ఆత్రేయ ఆత్రేయే" అన్నారు.

\- పైడిపాల

# ప్రేమకానుకలు

అతడొక రోమియో. పేరు మాత్రం పతి. పూర్తి పేరు లక్ష్మీపతి. నెలకోసారి అతడు సేఠ్ పూనమ్‌చంద్ బంగారు కొట్టుకి వెళ్తాడు. ఒక ఉంగరం ఆర్డర్ ఇస్తాడు.

"ఈ ఉంగరం మీద 'ప్రేయసి రాధకు-ప్రేమతో, పతి' అని మినియేచర్ స్క్రిప్ట్‌లో రాయించండి సేఠ్‌జీ!" వంద రూపాయిల నోట్ల కట్ట కౌంటర్ మీద పడేస్తూ అన్నాడు లక్ష్మీపతి-ఉరఫ్ రోమియో.

సేఠ్ పూనమ్‌చంద్ అతన్ని పరీక్షగా చూస్తూ, "నేనొక సంగతి చెప్తాన్ భాయ్- కోపం చేస్కోవ్ కదా?" అన్నాడు.

"చెప్పండి!" లక్ష్మీపతి విచిత్రంగా చూస్తూ అడిగాడు.

"ఉంగరంపై 'ప్రేయసికి- ప్రేమతో, పతి' అని చెక్కిస్తాం. ఫరవాలేదా?" సేఠ్ అడిగాడు.

"ఏం? రాధ అని పేరు వుంటే మీకేం నష్టం?"

"నష్టం లేదు భాయ్! కానీ లాభం వచ్చేదీ పోతూ వుందీ భాయ్! క్రిందటి నెల సీతకి ఒకటీ,




అంత ముందూ నెలా రీటాకి ఒకటీ, అంత ముందు నెలా కమలాకి ఒకటీ ఇలా పదీ ఉంగరాలు మీరు పేరూ చెక్కింపించారు. అవి అన్నీ మళ్ళీ మాకే వచ్చాయి. ఇదీ మళ్ళీ మాకే వస్తుంది భాయ్! అమ్మాయి పేరూ లేకపోతే, ఈ ఉంగరాలే మీకే మేం నెల నెలా అమ్ముతాం. మళ్ళీ కరిగించి ఉంగరాలు చేయింపించే శ్రమా మాకే తగ్గుతుందీ భాయ్! పేరూ వద్దు భాయ్! 'ప్రేయసికి-ప్రేమాతో, పతి' అంటే చాలు భాయ్!" ఏమంటావ్ అన్నట్టు అడిగాడు సేఠ్ పూనమ్‌చంద్.

తన జుట్టు పీక్కోవాలో, సేఠ్ జుట్టు పీకాలో తెలీక ఒక క్షణం అలా నిలబడిపోయాడు రోమియో పతి. సేఠ్ టోపీ తీసి, తల తుడుచుకున్నాడు. తలంతా నున్నగా వుంది. రోమియో చెయ్యి తన తల మీదకే వెళ్ళింది.

\- సుంకర భాస్కరరావు

# పుస్తక దహనం

బూర్జువా ఉదార వాదానికి, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేక పోరాటం అన్న పేరుతో చైనా ప్రభుత్వం ఇటీవల మరో ఘనకార్యం చేపట్టింది. ఆమధ్య ప్రజాస్వామ్య ఉద్యమం జరిగినప్పటి నుంచీ ప్రభుత్వం ఇటువంటి ఘనకార్యాలు వరుసగా చేస్తూ వస్తోంది. తాజాగా బూర్జువా సంస్కృతిని ప్రోత్సహించే సాహిత్యాన్ని మటుమాయం చేయాలన్న మహత్తర ఆలోచనలో భాగంగా గత కొద్ది రోజులుగా ఒక్క బీజింగ్‌లోనే నాలుగు లక్షల అరవై వేల పుస్తకాల్ని ప్రభుత్వం తగులబెట్టించింది. ఇతర పట్టణాలలో కూడా పుస్తక దహనం విశృంఖలంగా జరిగిందట. తగులబడిన పుస్తకాలలో చైనా సోషల్ సైన్సెస్ అకాడమీ మాజీ సభ్యులయిన పలువురు ప్రముఖులు రాసిన పుస్తకాలు, ఇంకా బూతు సాహిత్యం, బూతు చిత్రాలు కూడా వున్నాయి. ఇవన్నీ యువత మనసులను కలుషితం చేసి వారిని అనేక నేరాలకు పురికొల్పుతున్నాయని ప్రభుత్వం ఆరోపణ. ఇంతకీ- పుస్తక దహనం సోషలిస్టు సంస్కృతేనా? అది బూర్జువా సంస్కృతిని నిరోధించ గలుగుతుందా?!

